క్లుప్తంగా

నందమూరినగర్ ఇళ్లను పరిశీలించిన జేసీ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్ పరిధిలోని నందమూరినగర్ కూడలిలో ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ఇళ్లను జాయింట్ కలెక్టర్ ఇలక్కియా శుక్రవారం పరిశీలించారు. నార్త్‌జోన్ తహసీల్దార్ సూర్యారావుతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. కొన్ని ఇళ్లను కొలతలు తీసుకొని చుట్టుపక్కల ప్రాంతాల ప్రైవేటు భూముల గురించి వివరాలు అడిగి తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. సుమారు 70 ఇళ్ల వరకు ఉండగా వీరిలో 64 మంది వరకూ ఇంటి పట్టాల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇంటి పట్టాలు మంజూరు చేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. నార్త్‌జోన్ సర్వేయర్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయ అభివృద్ధి పనులకు విజయవాడకు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ లబ్బీపేటకు చెందిన ఎం.కృపారావు దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావుకు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అసిస్టెంట్ కమిషనర్ రంగారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

ఆదిత్య ఫార్మసీ చైర్మన్ కేసులో కదలికలు

సాక్షి ఎఫెక్ట్..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): ఈ నెల 5వ తేదీన చోటుచేసుకున్న ఆదిత్య ఫార్మసీ చైర్మన్ సాగి వెంకట నరసింహరాజు ఆత్మహత్య కేసులో కదలికలు వచ్చాయి. ఈ ఘటన చోటుచేసుకొని దాదాపు పదిహేను రోజులు కావస్తున్నా కేసు దర్యాప్తు ఎందుకు ముందుకు కదలలేదని పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీశారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తెలుగు తమ్ముళ్లు.. కూటమి నాయకుల పెత్తనం... నిందితులకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ సాక్షిలో శుక్రవారం వెలువడిన 'తమ్ముళ్లకు జీ హుజూర్' అనే కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. పోలీస్‌స్టేషన్‌లో అధికార పార్టీ నాయకుల సెటిల్‌మెంట్లు, కేసుల పురోగతిపై ఆరా తీసి పోలీసులకు పలు సూచనలు చేశారు. అలాగే ఆదిత్య ఫార్మసీ చైర్మన్ కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న సూసైడ్ నోట్‌ను శుక్రవారం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అలానే ఫిర్యాదులో పేర్కొన్న నిందితుల్లో ఒకరైన బుద్ధంరాజు శివాజీ వైజాగ్ ప్రాంతానికి చెందినవాడు కావడంతో కాల్‌డేటా ఆధారంగా ఒక ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుల్స్ బృందం వైజాగ్‌కు బయల్దేరి వెళ్లినట్లు సమాచారం.

విద్యార్థులకు ఫర్నిచర్ డీలర్స్ ఆర్థిక సాయం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలోని నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ఫర్నిచర్ డీలర్స్ అసోసియేషన్ నోటు పుస్తకాలు, ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం హనుమాన్‌పేటలోని ఫర్నిచర్ డీలర్స్ అసోసియేషన్ హాలులో అసోసియేషన్ అధ్యక్షుడు గ్రంధి శ్రీనివాసరావు, కార్యదర్శి గార్లపాటి శ్రీధర్ చేతుల మీదుగా ఒక్కో విద్యార్థికి రూ. 2వేలు చొప్పున 15 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం, నోటు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు. అసోసియేషన్ ప్రతినిధులు రాంబాబు, పలగాని ఆంజనేయులు, దామోదర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అంతంపై అవగాహన పెంచండి

పటమట(విజయవాడతూర్పు): ప్లాస్టిక్ నిర్మూలనపై నగరవాసులకు విస్తృతమైన అవగాహన కల్పించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ఆయన శుక్రవారం సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జోనల్ కార్యాలయంలో, వార్డుల్లో, సచివాలయంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ప్లాస్టిక్ అంతంపై, ప్లాస్టిక్ రహిత సమాజంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

ముంపు ముప్పు తప్పేనా..!

- కొద్దిపాటి వర్షానికే నీట మునుగుతున్న సింగ్‌నగర్‌లోని ప్రధాన రహదారులు
- మరమ్మతులకు నోచుకోని సైడ్ డ్రెయిన్లు



ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే నీటమునిగిన సింగ్‌నగర్ ఎంబీ స్టేడియం వెనుక నల్లమస్తాన్ రోడ్డు



న్యూఆర్‌ఆర్‌పేటకు వెళ్లే ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు



కృష్ణాహోటల్ సెంటర్ బస్‌రూట్‌లో చెత్తతో నిండిన డ్రెయినేజీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదలు సంభవించి ఏడాది సమయం గడుస్తున్నా ఇంకా పాలకులు కాని, అధికార యంత్రాంగం కాని సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాలపై సరైన దృష్టి సారించడం లేదు. వర్షంనీరు సంగతి పక్కన పెడితే కనీసం మురుగునీరు, యూజీడీ లైన్లు సక్రమంగా పారే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ వర్షాకాలంలో కొద్దిపాటి చినుకులు పడినా ఇక్కడి ప్రధాన రహదారులన్నీ జలమయం అవుతున్నాయి.

అధ్వానంగా డ్రెయినేజీలు

బుడమేరు వరదల తర్వాత సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన కాలువలు, యూజీడీ లైన్లు చాలా చోట్ల పగిలిపోయాయి. కొన్ని చోట్ల అస్సలు కాలువల నిర్మాణాలే లేకపోవడంతో మురుగు నీరు పారే దారి లేదు. దీంతో కొద్దిపాటి వర్షం పడినా ఆ నీళ్లన్నీ రోడ్లపై, ఇళ్లల్లోకి చేరి ముంపునకు గురవుతున్నాయి. సింగ్‌నగర్, నందమూరినగర్, తోటవారివీధి పరిసర ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి డ్రెయినేజీ నీరు పొంగి రోడ్లపైకి ప్రవహిస్తూనే ఉంది. అధికారులు ఆ సమయంలో డ్రెయినేజీ వాటర్ తోడించడం, రోడ్లపై నిలిచిన మురుగునీటిని పక్కకు మళ్లించడం వంటి చర్యలతో సరిపెడుతున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. అసలు యూజీడీ లైన్లు ఎక్కడ నిలిచిపోతున్నాయి. అవి ఆగకుండా పారే మార్గాలేంటీ.. సైడ్ డ్రెయిన్లు శిథిలావస్థకు చేరినవి ఎన్ని, అసలు సైడ్ డ్రెయిన్లు లేని ప్రాంతాలు, రోడ్లు ఎన్ని.. ఎన్ని చోట్ల మరమ్మతులు చేయాలి.. ఎన్ని రోడ్లలో కొత్తగా డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలనే అంశాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. డ్రెయిన్లు పెద్దవి చేసి నిర్మించడంతో పాటు.. పాడైపోయిన డ్రెయిన్లకు మరమ్మతులు చేయించడంతో చాలా వరకు ముంపు సమస్య తగ్గే అవకాశం ఉంది.

పూడిక కూడా తీయడం లేదు

సింగ్‌నగర్, పాయకాపురం, న్యూఆర్‌ఆర్‌పేట, వాంబేకాలనీ, నందమూరినగర్, ఆంధ్రప్రభకాలనీ, ఇందిరానాయక్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన డ్రెయిన్లలో ఎక్కడపడితే అక్కడ చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. కాలువల్లో చెత్త అడ్డు పడి మురుగునీరు కదిలే మార్గం లేక పరిస్థితి అధ్వానంగా ఉందని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. వాటి నుంచి వస్తున్న దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులను నిలదీస్తే బుడమేరు వరదల ప్రభావం అని.. డ్రెయిన్లు నిర్మించాలంటూ సాకులు చెబుతున్నారే తప్ప కనీసం వాటిల్లో పూడికలు తీసేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. కనీసం సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా కార్యాలయం ముందు, పక్కన డ్రెయిన్లను కూడా శుభ్రం చేయడం లేదని అక్కడి స్థానికులు వాపోతున్నారు. మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం పక్కన నల్లమస్తాన్‌రోడ్డు, కృష్ణాహోటల్ సెంటర్‌కు వెళ్లే దారిలో కూడా కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఈ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు నిలువ ఉండకుండా.. రహదారులు, గృహాలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

25న చలో విజయవాడ మహాధర్నా



మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన పీడీఎస్‌యూ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన చలో విజయవాడ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీ, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ పీడీఎస్‌యూ కార్యాలయంలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పాఠశాలల విలీన ప్రక్రియ వల్ల వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని చెప్పారు. విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో వివిధ రకాల పేర్లతో జరుగుతున్న ఫీజుల దోపిడీ అరికట్టాలని అన్నారు. 2024 – 25లో తల్లికి వందనం పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ. 3వేలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి 25న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను, రాష్ట్ర కోశాధికారి రూప శంకర్, రాష్ట్ర నాయకులు నాగరాజు, శ్రీను, షాహీద్, నవీన్, దినేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 29 నుంచి తెలుగు భాషా ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, జీవీ పూర్ణచందు, సుశీల, సుబ్బారాయుడు

విజయవాడ కల్చరల్: తెలుగు భాషా సాహితీ సమితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 29వ తేది నుంచి మూడు రోజులపాటు నెల్లూరులోని రేబాల లక్ష్మీసరస్వతి మందిరంలో తెలుగు భాషా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గవర్నర్‌పేటలోని తెలుగు రచయితల సంఘం కార్యాలయంలో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ ప్రధాన న్యాయమూర్తులు, భాషా పరిశోధకులు పాల్గొంటారన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలను అందించిన వారికి పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సేవ భాషా సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు కంచర్ల సుబ్బారాయుడు, డాక్టర్ సుశీల పాల్గొన్నారు.

నవరస నటుడు ఎస్వీ రంగారావు

విజయవాడ కల్చరల్: నవరస నటుడు ఎస్వీ రంగారావు అని రాష్ట్ర నటీనటుల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. శ్రీకళామంజరి, సి.రామ్మోహనరావు కళాపీఠం, ఎస్వీఆర్ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సినీ నటుడు ఎస్వీ రంగారావు 53వ వర్ధంతి సభను తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ ఎస్వీఆర్ ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయగల నటుడని అభివర్ణించారు. కార్యక్రమంలో పీవీఎల్ నృసింహం, హరగోపాల్, నవనీతం సాంబశివరావు, బడే ధర్మారావు, బీజేపీ నాయకులు గణేష్, బడేటి ధర్మారావు ఎస్వీఆర్ సినీ రంగ సేవలను వివరించారు. అనంతరం ఏపీ బిల్డింగ్ కమిటీ అడ్వైజర్ రఘురామరాజును ఘనంగా సత్కరించారు.

శాకంబరీదేవి అలంకారంలో కాళీమాత అమ్మవారు



శాకంబరీ దేవి అలంకారంలో మహంకాళీ అమ్మవారు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వెజిటబుల్ కార్వింగ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆషాఢ మాసం పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకంబరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉన్న మహంకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి దేవి అమ్మవార్లను భక్తులు సమర్పించిన మూడు టన్నుల వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరించారు. ఉపాలయాలైన విఘ్నేశ్వరుడు, ఆంజనేయ స్వామి, ఉత్సవమూర్తులను కూరగాయలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం వివిధ రకాల కూరగాయలతో రకరకాల పక్షులు, జంతువులు, బొమ్మల కార్వింగ్ తయారు చేసి ఆలయ ముఖ మండపంలో అందంగా అలంకరించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ షణ్ముఖం దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. భక్తులకు కదంబం ప్రసాదం పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్ కుమార్, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు సీహెచ్ విజయకిరణ్, కమిటీ సభ్యులు జి.సత్యం, జగన్, మల్లేశ్వరరావు, విశ్వేశ్వర్ తదితరులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ అన్నదాన సమాజం రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్తు లైన్లు మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుస్సేన్ సాహెబ్ వీధి, జెండా వీధి, గోగావారి వీధి, రామమందిరం వీధి, చింతావారి వీధి, దాసువారి వీధి, మసీదు వీధి, జలీల్ వీధి, దుర్గయ్య వీధి, మొహిద్దిన్ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పైపులరోడ్డు ఫీడర్ సింగ్‌నగర్ షాదీఖానా రోడ్డు, నూజివీడు రోడ్డు, కృష్ణాహోటల్ సెంటర్, దుర్గా బార్, తిలక్ రోడ్డు, యార్డ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు.

ముత్యాలంపాడు ఫీడర్ పరిధిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవీంద్రబాబు తెలిపారు. జీఎస్ రాజు రోడ్డు, ఒరుగువారి వీధి, దాట్ల బ్రహ్మరాజు వీధి, దేవాలయం వీధి, సుబ్బరాజు వీధి, బెజ్జంవారి వీధి, గొట్టిముక్కల సూర్యనారాయణరాజు పాఠశాల, పశుసంవర్ధక శాఖ కార్యాలయం, ప్రభుత్వ ముద్రణాలయం, అంబేడ్కర్ నగర్, చల్లపల్లివారి వీధి, రాణాప్రతాప్ రోడ్డు, కొమ్ము వారి వీధి, బ్రహ్మయ్యపంతులు వీధి, సుమానం వారి వీధి, అమలి స్కూల్, మారుతి వ్యాయామశాల, భగత్‌సింగ్ రోడ్డు, జనార్ధనరావు వీధి, పాపరాజు వీధి, కనకరాజు వీధి, కావూరువారి వీధి, నర్రావారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

దోమల నివారణకు ఫ్రైడే – డ్రైడే

పటమట(విజయవాడతూర్పు): ఫ్రైడే – డ్రైడే ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా నగరంలోని చిట్టినగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలలో దోమల వ్యాప్తి అరికట్టడానికి అందరికీ అవగాహన ఉండాలని అన్నారు. డాక్టర్ మనోజ్ఞ మాట్లాడుతూ దోమల వల్ల వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా వ్యాధి లక్షణాలు తెలుసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వీఎంసీ మలేరియా సిబ్బంది స్థానికంగా దోమ లార్వా నిరోధక మందులను చల్లారు.

వెన్నం జ్యోతి సురేఖ మరిన్ని విజయాలు సాధించాలి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): భారత ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ఇటీవల జరిగిన ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్–4 పోటీలలో అద్భుతమైన ప్రదర్శన చూపించి దేశానికి గర్వకారణంగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోన్ ఎఫ్‌జీఎం సీవీఎస్ భాస్కరరావు అన్నారు. ఇటీవల ఆమె సాధించిన విజయాలను పురస్కరించుకుని సురేఖ స్వగృహంలో ఆమెను కలిసి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ సురేఖ బరిలోకి దిగిన మూడు విభాగాల్లో రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం గెలుచుకోగా, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ప్రపంచ రికార్డు సృష్టించటం అభినందనీయమన్నారు. ఆమె భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేఖ తండ్రి వెన్నం సురేంద్ర, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విజయవాడ ఫిక్కీ ఫ్లో సీనియర్ వైస్ చైర్మన్ మల్లినేని సుప్రియ సూచించారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిక్కీ ఫ్లో, విజయవాడ సౌజన్యంతో నిర్వహిస్తున్న 'సాంకేతిక ప్రపంచంలో మహిళా సాధికారత' వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థినులు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. విశిష్ట అతిథి ప్రముఖ సంఘ సేవకురాలు ప్రభ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఇంత చక్కటి వర్క్‌షాప్ ఏర్పాటు చేయడానికి సహకరించిన ఫిక్కీ ఫ్లో కార్యవర్గానికి, శిక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న 81 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫిక్కీ ఫ్లో కార్యదర్శి సుమ, సంయుక్త కార్యదర్శి దీప్తి, సభ్యులు తులజ, సౌజన్య యూత్ మెంటరింగ్ ఇనిషియేటివ్ హెడ్, ప్రముఖ శిక్షకులు ఫాజియా తరన్నుమ్, శివస్వాతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాధనం బాబాలు, స్వాములకు ధారాదత్తం



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక కార్యదర్శి వెలగా శ్రీనివాస్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజల సంపదను పాలకులు స్వాములు, బాబాలకు ధారాదత్తం చేస్తున్నారని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు ఆరోపించారు. అక్రమాలు, మోసాలకు నిలయమైన పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా జరపడాన్ని వారు ప్రశ్నించారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పండుగ జరపాల్సింది శాస్త్రీయతకా–మూఢత్వానికా అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక కార్యదర్శి వెలగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఉన్నారని, మదనపల్లిలో కోట్లాది విలువైన హార్స్‌లీ భూములను నకిలీ వస్తువులు ఉత్పత్తి చేసే రాందేవ్‌కు అప్పనంగా ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ధోరణులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో నాగార్జున సాగర్ వంటి అనేక నిర్మాణాల ప్రారంభంలో మతపరమైన క్రతువులు చేయలేదని గుర్తు చేశారు. ప్రముఖ నాస్తికుడు మోతుకూరి అరుణకుమార్, జేవీవీ రాష్ట్ర నాయకులు మురళీధర్, వెనిగళ్ళ మురళి మాట్లాడుతూ బాల్యం నుంచి ప్రశ్నించే తత్వం పెరగాలని, ఆ దిశగా పిల్లలో చైతన్యం కలిగించే విధంగా తీర్చిదిద్దే బాధ్యత నేటి తరం మీద ఉందన్నారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు దివికుమార్, పిచ్చయ్య, సత్యనారాయణ, కోటేశ్వరరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ అధ్యక్షుడు కామయ్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) అధ్యక్షుడు కె.కామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కామయ్య మాట్లాడుతూ ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ రిటైర్డ్ ఉద్యోగుల వలె తక్షణమే బకాయిలు అన్ని చెల్లించాలని, 2019 నుంచి నిధుల వినియోగంపై ప్రత్యేక ఆడిట్, సమగ్ర సమీక్ష జరిపించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి హెడ్ ఆఫీస్ ఉద్యోగులకు ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ, పీఆర్‌సీ బకాయిలు చెల్లించిన విధంగానే పాఠశాల, కళాశాలల్లో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ట్రెజరర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

మధురానగర్(విజయవాడసెంట్రల్): 'రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో' గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 5 గంటలకు సత్యనారాయణపురం నాడార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలోని క్లస్టర్ –2 కార్యవర్గంతో పాటు, 28, 29, 30, 31, 32, 33, 57 డివిజన్లకు చెందిన ఇన్‌ఛార్జిలు, కార్పొరేటర్లు, జిల్లా, డివిజన్ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

చిట్టిబాబుకు సేవారత్న పురస్కారం



చిట్టిబాబును సత్కరిస్తున్న సద్గురు రామ్‌నారాయణ్ సభ్యులు

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన తెలుగు కళావాహిని సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబుకు సేవారత్న పురస్కారం లభించినట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కర్నాటకకు చెందిన సద్గురు రామ్‌నారాయణ్ మఠ్ ప్రతి ఏటా ఆధ్యాత్మిక, కళాసేవ రంగంలో వారి వారి సేవలను గుర్తించి పురస్కారం అందజేస్తుంది. 2025 సంవత్సరానికి గాను చిట్టిబాబుకు శుక్రవారం కర్నాటకలోని చిక్‌బల్లాపూర్‌లో ఈ పురస్కారం ప్రదానం చేశారు. చిట్టిబాబు 25 ఏళ్లుగా సాహిత్య, సామాజిక సేవా రంగంలో ఉన్నారు. తెలుగు కళావాహిని ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహించారు. నగరానికి చెందిన పలు సంస్థలు చిట్టిబాబును అభినందించాయి.

సచివాలయ కార్యదర్శి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సచివాలయ కార్యదర్శి అదృశ్యమైన ఘటన విజయవాడ బీసెంట్ రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. జి. కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన గజ్జల లక్ష్మీతిరుపతమ్మ హెచ్.ముత్యాలంపాడు సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తోంది. నాలుగు నెలల క్రితం విజయవాడ బీసెంట్ రోడ్డులోని డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వచ్చింది. ప్రతి రోజు ఉదయం ఆమె భర్త సుబ్బారావు వెలగలేరు నుంచి బైక్‌పై ఎక్కించుకొని డీఎల్‌పీఓ కార్యాలయానికి తీసుకువచ్చేవాడు. సాయంత్రం విధులు పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి బైక్‌పై తీసుకెళ్లేవారు. రోజూ మాదిరిగానే గురువారం లక్ష్మీతిరుపతమ్మ భర్త ఆమెను డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద దించి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు ఆఫీసు వద్దకు వెళ్లగా ఆమె ఆఫీసులో లేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీనిపై లక్ష్మీతిరుపతమ్మ భర్త సుబ్బారావు గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.